# అవసరం అనర్థం

సాంబశివరావు మోతడక వూళ్ళో బస్సెక్కాడు. బస్సులో అంతా ఖాళీగావుంది. ఓ సీట్లో కిటికీ వారగా కూర్చున్నాడు. అతనిముందు సీట్లో ఒకామె కూర్చుని వుంది. ఆమె పేరు సంగీత. కళ్ల కింద బుగ్గలు నునుపు తేలినా మనిషంతా వాడి పోయినట్టుగా వుంది. వంకీల జుట్టు, వాలుజడ వేసుకొన్నది.

ఆమె కూడా అంతకు ముందు స్టేజ్‌లో ఎక్కిందేమో - కండక్టరు వచ్చి టిక్కెట్టు గురించి అడిగినప్పుడు చేతిలో వున్న పర్సును తడిమి కొంచెం కంగారుపడింది... అందులో డబ్బు ల్లేవు.

వెనుక సీట్లో కూర్చున్న సాంబశివరావు సంగీత కంగారును గుమనించి విషయం గ్రహించి...

"గుంటూరుకేగా... నేను తీసుకుంటాను" అని సంగీత టిక్కెట్టును కూడా తనే తీసుకున్నాడు. అప్పుడు ఆమె అతనికి మర్యాద కోసమయినా థాంక్స్ చెప్పలేదు. తను వయసులో వున్న ఆడది కాబట్టి అతను తనకు టిక్కెట్టు తీసుకున్నాడని అనుకుంది. అందువల్ల అతను పొందిన లాభమేమిటో ఆమె ఆలోచించలేదు. ఏదో ఒక విధంగా చాలామంది మగాళ్లు తన ప్రాపకం కోసం ఎదురుచూస్తూ వుంటారని ఆమె ఆలోచన అయివుంటుంది. అలా అనుకున్నా ఆమె అందమయినదికాదు. మగాడికి ఇంకా కొంచెం ఉపయోగపడే వయసు తప్పించి ఆమెలో ఎటువంటి ఆకర్షణా లేదు.

కొంచెం సేపటికి బస్సు గుంటూరు చేరింది.

దిగారు.

"ఎక్కడికి వెళ్లాలి?" అనడిగాడు సాంబశివరావు సంగీతను.

"ఇంటికి"

"నాతో కలిసి ఓ కప్పు కాఫీ తాగితే సంతోషిస్తాను. అలా హోటలుకు వెళదాం" అన్నాడతను.

అతను వేసుకున్న పొందూరు ఖద్దరు షర్ట్ జేబులోనించి బయటకు కనపడుతున్న ఐదువందల రూపాయల నోటుమీద గాంధీ బొమ్మను చూస్తూ, తనకు టిక్కెట్టు తీసుకున్నాడనే మొగమాటం కొద్దీ సరేనని తలవూపింది. ఇలా తలవూపటానికి ముందు రోజురోజుకీ తనలో పెరుగుతున్న రోగాన్ని కూడా గుర్తుకు తెచ్చుకుంది.

ఆ అవసరం సంగీతను సాంబశివరావుతో బస్టాండు ఎదురుగా వున్న హోటల్లోకి నడిపించింది.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని కాఫీ తాగుతున్నప్పుడు సాంబశివరావు ఆమె గురించిన వివరాలు అడిగాడు.

ప్రతాప రవిశంకర్

తన భర్త తన గురించి పట్టించుకోడనీ, చిల్లర మల్లర పనులు చేసి ఆ వచ్చిన డబ్బును తన సరదాలకు ఖర్చు పెట్టుకుంటాడనీ, తనకు ముగ్గురు పిల్లలు వున్నారనీ, ఈ మధ్యనే తనలో ఓ రోగం ప్రవేశించిందనీ దానికి ఖరీదయిన మందులు వాడాలనీ, కానీ తన భర్త పెంచెలయ్య తన గురించి పట్టించుకోడనీ, తనను డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లడం లేదనీ చెప్పి బాధపడింది.

అప్పుడు సంగీత చెప్పినదంతా విని సాంబశివరావు బాధపడ్డాడు. పెంచెలయ్య బాధ్యతా రాహిత్యాన్ని నిందించి భయపడవద్దనీ, ఎందుకో సంగీతంటే తనకు అభిమానం కలుగుతోందనీ ఆమెను మంచి స్పెషలిస్టు డాక్టరుకు చూపించి మంచి మందులు కొనిపెడతాననీ హామీ ఇచ్చి వాగ్దానం చేస్తున్న నెపంతో సంగీత చెయ్యి మీద చెయ్యి వేసి మృదువుగా నొక్కాడు. ఆ స్పర్శ సంగీతకు బావున్నట్లనిపించింది.

ఆ తర్వత సాంబశివరావు తన గురించి సంగీతకు ఇలా చెప్పాడు.

తన పేరు సాంబశివరావు అనీ, తను ఆ వూళ్లో ఓ మోతుబరి రైతుననీ, డబ్బుకు కొదువలేదనీ, తనకు కొన్నాళ్ల క్రితం భార్యా వియోగం జరిగిందనీ, ఆ చనిపోయిన భార్య కూడా దాదాపుగా సంగీతలాగానే వుండేదనీ, అందువల్లనే సంగీతను వదల్లేక పోతున్నాననీ, తనకు పిల్లలు లేరనీ తన గురించి పట్టించుకునే వాళ్లూ ఎవరూ లేరనీ, తను బాగా లోన్లీగా ఫీలవుతున్నాననీ చెప్పి, సంగీత ఆలనా, పాలనా తనే చూసుకుంటానని చెబుతూ తన భార్య స్థానాన్ని సంగీతను భర్తీ చేయవలసిందిగా దీనంగా అర్థించాడు.

సమస్యలతో, పేదరికంతో, భర్త అనాదరణతో సతమతమవుతున్న సంగీత సహజంగానే సాంబశివరావు ప్రపోజల్‌కు తలవొగ్గినా, అదే అదనుగా భావించి మరింత లాభపడాలను కొంది.

ఆమె ఆలోచనలను గమనించి "ఏమిటి? సంశయించకు... అడుగు" అన్నాడు సాంబశివరావు.

"నాకు గుంటూరులో ఒక చిన్న ఇల్లు కట్టుకోవాలని వుంది. అందుకోసం చీటీ కూడా కట్టి పాడాను. అయినా డబ్బు చాలలేదు" అన్నది అసంతృప్తిగా...

"ఇంతేనా... దిగులు పడకు... నీ డబ్బులు నువ్వే వుంచుకో... నా డబ్బుతో నీకు ఇల్లు కొనిపెడతాను" అని భరోసా ఇచ్చాడు.

అప్పుడు సంగీత మొహం వికసించింది.

"ఇంకానయం. ఆ బసవశంకరరావు మాయలో పడ్డాను కాను. రూపాయి కూడా వచ్చేది కాదు. అంతా తన అదృష్టం" అనుకుంది సంగీత లాభనష్టాలు బేరీజు వేసుకుంటూ. నిజానికి బసవశంకరరావు గురించి సంగీత చెల్లెలు పుష్పవతి అక్కయ్యకు సలహా ఇచ్చింది.

"ఆ బసవశంకరరావు వల్ల ఫైనాన్షియల్‌గా నీకు ఎలాంటి ఉపయోగం వుండదు. వాడిని వదిలెయ్యి... వాడి జోలికి వెళ్లకు" అని ముందుగానే హెచ్చరించింది. బసవశంకరరావు వాళ్లకి బాగా తెలిసిన మనిషి. సంగీత చెల్లెలు పుష్పవతికి పేరుకు మొగుడువున్నా వాడిని వదిలి తనకిష్టమయిన మగాళ్లతో తిరుగుతూ లైఫ్‌ని ఎంజాయ్‌చేస్తూ వుంటుంది. పైకి ఇద్దరి మధ్యనా అభిప్రాయభేదాలు వున్నట్టు కనపడినా లాభదాయకమయిన వ్యవహారాలు చెయ్యటానికి ఇద్దరూ ఒకరి సలహాలు ఒకరు తీసుకుంటూ పైకి నాటకం ఆడుతూ వుంటారు.

సంగీత ఆకలి చూపును గమనించి సాంబ

శివరావు జేబులోనుంచి ఐదు వందల రూపాయల నోటును తీసి సంగీతకు ఇవ్వబోయాడు.

కొంచెం అయిష్టతను నటించింది సంగీత.

ఇద్దరి డబ్బూ ఒకరిదే... నా డబ్బే నీ డబ్బు... నేనే నువ్వు... నువ్వే నేను... రేపు ఉదయం పదిగంటలకు బస్టాండుకు వచ్చెయ్యి. ఇక్కడికి నీ ఇల్లు దగ్గరని చెప్పావుగదా... వస్తే ఇద్దరం కలిసి మంచి డాక్టరు దగ్గరకు వెళదాం... పరీక్షలు చేయించి మందులు కొనిపెడతాను... ఇక నీ బాధ్యత నాది. ఊరి బయట పొలంలో నాకు ప్రత్యేకంగా చిన్న ఇల్లు వుంది. డాక్టరు



దగ్గర్నించి మా వూరు వెళదాం... "మా ఇల్లు చూద్దువుగాని... మనల్ని పలకరించే వాళ్లు కూడా వుండరు. నువ్వూ నేను - నేనూ నువ్వు" అని చెప్పి ఈసారి సంగీత భుజం మీద చెయ్యి వేసి నొక్కి వెళ్లిపోయడు సాంబశిరావు.

ఆ రాత్రి సాంబశివరావు తలపులతో సంగీతకు నిద్రపట్టలేదు. అంతేగానీ తను చేస్తున్న పని తప్పా? రైటా? అనే ఆలోచన సంగీతకు రాలేదు.


తన భర్త పెంచెలయ్య తనని నిర్లక్ష్యం చేశాడు. తన జీవితం తనది. సాంబశివరావు అనుకోకుండా తనని చేరదీశాడు. తన రోగాన్నీ నయంచేయిస్తానన్నాడు. ఇల్లు కట్టిస్తానన్నాడు. తన పిల్లల చదువుల గురించి పట్టించుకుంటానన్నాడు. ఇంతకంటే తనకేం కావాలి? ఇది స్వార్థం కాదు. తన కుటుంబం కోసం... భర్త వల్ల ఏర్పడిన ఖాళీని సాంబశివరావు పూర్తి చేస్తున్నాడు. అతని అవసరం అతనిది. తన అవసరం తనది. అవసరం ఎలాంటిదయినా ఇద్దరు మనుషులను కలుపుతోంది. గుట్టుగా నెట్టుకు వస్తే తను లాభిస్తుంది. కావాలంటే తన అవసరాలు తీరిన తర్వాత సాంబశివరావుకు ఉద్వాసన చెప్పవచ్చు.

ఇలా అనుకుని మర్నాడు సాంబశివరావుతో కలిసి ఓ డాక్టరు దగ్గరకు వెళ్లింది. ఆయన అనేక పరీక్షలు చేసి ఊపిరితిత్తులకు సంబంధించిన రోగం ముదురుతోందని చెప్పి మందులు రాసి ఇచ్చాడు.

సంతోషంగా ఆ మందులతో బస్సెక్కి సాంబశివరావుతో కలసి మోతడకలో పొలంలో వున్న



హైదరాబాద్ నగర కేంద్ర గ్రంధాలయంలో తురగా ఫౌండేషన్, మానస ఆర్ట్ థియేటర్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన సభలో కవి సుధామను తురగా కృష్ణమోహనరావు స్మారక సాహితీ పురస్కారంతో సత్కరిస్తున్న ఆకాశవాణి సంచాలకులు పి.యస్. గోపాలకృష్ణ. చిత్రంలో సి. మృణాళిని, డా॥ కె.బి. లక్ష్మి, రఘుశ్రీ, ఆదివిష్ణు, తురగా జానకీరాణి, తురగా వసంతశోభ, ఉషారమణ రేవల్లి తదితరులున్నారు.




అతని ఇంటికి వెళ్లింది. ఆ ఇంట్లో అన్ని సౌకర్యాలూ వున్నాయి. ఓ గదిలో టేకుతో చేసిన డబుల్‌కాట్, దానిమీద మెత్తటి పరుపూ కనిపించాయి. తన ఇంట్లో నేలమీద ఓ పాతగుడ్డను పరుచుకుని రోజూ పడుకునే సంగీత ఆకర్షితురాలయి ఆ పరుపుమీద పడుకుంది. ఆ తర్వాత కొంతసేపటికి సాంబశివరావు వచ్చి తన పక్కనే పడుకుంటే వారించలేకపోయింది. అతను తన కోసం డాక్టరుకు ఇచ్చిన ఫీజూ, కొనిచ్చిన మందుల ఖర్చూ అన్నీ కళ్లమందు కదిలాయి. అతను తనకోసం ఖర్చుపెట్టిన డబ్బు నీతి నియమాలను తరిమికొట్టింది.

అలా కొన్నాళ్లు గడిచాయి.

ఎవరికీ అనుమానం రాకుండా నటిస్తూ సాంబశివరావుతో సహజీవనం సాగిస్తోంది. ఎవరికీ తెలీకుండా తను పాత తరహా జీవితాన్ని గడుపుతూనే సాంబశివరావు దగ్గర నుంచి సంపాదించిన డబ్బుని బ్యాంకులో దాచుకుంటోంది సంగీత.

ఇలా కొన్ని రోజులు గడిచాయి.

సంగీతకు ప్రతిరోజూ జ్వరం రావటం మొదలు పెట్టింది. మనిషి హఠాత్తుగా బరువు తగ్గిపోయింది.

తన గురించి తనే సందేహపడి ఒక రోజు సాంబశివరావుతో హాస్పిటల్‌కు వెళ్లి టెస్ట్ చేయించుకుంది.

ఆమెకి ఎయిడ్స్ సోకినట్టు రిపోర్ట్ వచ్చింది.

భయపడింది సంగీత.

"నీవల్లనే నాకు ఎయిడ్స్ వచ్చింది" పోట్లాడింది సాంబశివరావుతో.

"నోర్మూసుకో, నాకు ఎయిడ్స్ లేదు. రెండ్రూపాయల బస్సు టిక్కెట్టుకు లొంగిపోయే ఆడదానివి... ఎవడి దగ్గర తగిలించుకున్నావో... చావుకోసం ఎదురుచూడు..." అని గబగబా వెళ్లిపోయాడు సాంబశివరావు.